క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న కౌన్సిలర్ భాస్కర్‌రెడ్డి, డిపో మేనేజరు కరిమున్నీసా

ఆత్మకూరురూరల్: స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో ఆత్మకూరు మున్సిపల్ 20వ వార్డు కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి తన తండ్రి వెంకట సుబ్బారెడ్డి జ్ఞాపకార్థం సోమవారం చలివేంద్రం ప్రారంభించారు. డిపో మేనేజరు కరిమున్నీసా, సీటీఐ కల్పన మాట్లాడుతూ భాస్కర్‌రెడ్డి ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వేసవికాలం పూర్తయ్యే వరకు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ నాయకులు మేకపాటి చిన్నారెడ్డి, కంచి పెంచలరెడ్డి, డిపో కార్మికులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశ గడువు పొడిగింపు

ఆత్మకూరు: ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాల (బాలికలు)లో 2023–24 విద్యా సంవత్సరానికి ఐదో తరగతిలో ప్రవేశానికి గడువును ఈ నెల 28వ తేదీ వరకు పొడిగించినట్లు ఏపీ గురుకుల పాఠశాల ఆత్మకూరు ప్రిన్సిపల్ హెచ్ఎస్ అన్నపూర్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతి ప్రవేశంతో పాటు 6,7 తరగతుల్లో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ కోసం దరఖాస్తులను నిర్దేశించిన తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను నమోదు చేసుకోవాలని ఆమె వివరించారు.

దరఖాస్తుల స్వీకరణకు గడువు పెంపు

ఉదయగిరి: ఏపీ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశానికి సంబంధించి దరఖాస్తుల స్వీకరణ గడువును పెంచినట్లు గండిపాళెం గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ జి.మురళీకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28వ తేదీ వరకు పొడిగించారన్నారు.

డివిజన్‌లో 68.8 మి.మీ. వర్షపాతం నమోదు

ఆత్మకూరు: ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఆత్మకూరు మండలంలో 7.2 మిమి, ఉదయగిరి 19.8 మి.మీ., మర్రిపాడులో 22.4 మి.మీ., అనంతసాగరంలో 19.4 మి.మీ., చొప్పున డివిజన్‌లో 68.8 మి.మీ. వర్షపాతం నమోదైంది.

పాత నేరస్తుడి పనే

కావలి: కావలి బృందావనం కాలనీలో ఈ నెల 16న జరిగిన భారీ చోరీ ఘటనలో పోలీసులు కీలక ఆధారాలు సేకరించారు. సీసీ పుటేజీల ఆధారంగా చోరీకి పాల్పడింది పాతనేరస్తుడే అని నిర్ధారణకు వచ్చారు. పలు జిల్లాల్లో చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్న నేరస్తుడే ఇక్కడ కూడా చోరీకి పాల్పడినట్లుగా సీసీ కెమెరాల్లో స్పష్టమైంది. పక్కాగా రెక్కీ నిర్వహించి చోరీ చేసిన అనంతరం తాపీగా రోడ్డుపైకి వచ్చి బస్సులో పారిపోయినట్లుగా సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. దీంతో సదరు నేరస్తుడి కోసం ప్రత్యేక బృందం గాలింపు చర్యలు ముమ్మరం చేసింది.

లోకోస్ యాప్‌పై శిక్షణ

కావలి రూరల్: పట్టణంలోని మండల సమాఖ్య కార్యాలయంలో సోమవారం కావలి, కందుకూరు డివిజన్ల పరిధిలోని 11 మండలాల ఏపీఎం, సీసీలు, వీఓఏలకు లోకోస్ యాప్ పుస్తక నిర్వహణపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఏపీఎం పి.చిన్నయ్య మాట్లాడుతూ మహిళ సంఘాల సమాఖ్యలో ఆర్థిక లావాదేవీలు, సమావేశాలు, నిర్వహణ దేశం మొత్తంలో ఒకే విధంగా ఉండేలా ఈ లోకోస్ యాప్‌ను ఆవిష్కరించిందన్నారు. ఏపీఎం కాంతారావు, వెలుగు సీసీ మోహన్‌రావు, కోవూరు సీసీ హరి, కొడవలూరు వీఓఏలు మస్తానమ్మ, వెంకటరమణమ్మ, అన్నీ మండలాల ఏపీఎంలు, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

డెంగీతో మహిళ మృతి



బుజ్జమ్మ (ఫైల్)

అల్లూరు: డెంగీతో గిరిజన మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని గాలిదిబ్బలలో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన మానికల బుజ్జమ్మ (35) వారం రోజులుగా డెంగీతో బాధపడుతూ అల్లూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో నెల్లూరుకు తరలించగా ఆదివారం మృతి చెందింది.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

కావలి రూరల్: కుటుంబ కలహాలతో ఓ మహిళ ఇంట్లో అందరూ ఉండగానే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన సోమవారం రాత్రి కావలిలో జరిగింది. 1వ పట్టణ సీఐ కె.శ్రీనివాసరావు సమాచారం మేరకు.. బోగోలు మండలం ఏబీకండ్రిక గ్రామానికి చెందిన లక్ష్మీసుమతి (28)కి పట్టణంలోని విష్ణాలయం ప్రాంతంలో నివాసం ఉంటున్న ఎలువు శేఖర్‌తో 7 ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. భర్త కాంట్రాక్ట్ పనుల నిమిత్తం బయటకు పనులకు వెళ్తుండేవారు. ఈ క్రమంలో ఇంట్లో ఉన్న అత్త కోడళ్లకు నిత్యం చిన్నపాటి గొడవలు జరుగుతున్నాయి. సోమవారం రాత్రి లక్ష్మీసుమతి తన కుమార్తెను కొట్టడంతో ఎందుకు కొడుతున్నావని అత్త అడగడంతో ఇద్దరి మధ్య చిన్నపాటి గొడవ జరిగింది. దీంతో ఇంట్లోకి వెళ్లిన ఆమె కుమార్తె చూస్తుండగానే భర్తతో ఫోన్‌లో మాట్లాడుతూనే ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఒకటో పట్టణ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పల్లెల ప్రగతికి పంచాయతీరాజ్ పట్టుగొమ్మ

ఆత్మకూరురూరల్: గ్రామాల్లో ప్రభుత్వం ద్వారా మంజూరైన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో పంచాయతీరాజ్‌శాఖ పట్టుగొమ్మ వంటిదని ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత గాంధీజీ, బీఆర్ అంబేడ్కర్‌ల చిత్రపటాలకు అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మండల స్థాయిలో ఆదర్శ పంచాయతీలుగా ఎంపికైన మహిమలూరు, బోయలచిరివెళ్ల సర్పంచ్‌లు పట్టెడ చంద్రశేఖర్, బొలిగర్ల వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శులు పల్లవోలు భాస్కర్, రేవూరు అంకయ్య, షేక్ షఫీలను శాలువా, పూలమాలలతో సత్కరించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఎంపీడీఓ శ్రీనివాసులు, ఈఓపీఆర్డీ ఉషారాణితో కలిసి మండలంలోని పలు పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులకు సర్టిఫికెట్లు అందించారు. నువ్వూరుపాడు ఎంపీటీసీ గడ్డం సుచిత్ర, సర్పంచ్ వెంకట రమణమ్మ, పమిడిపాడు, కనుపూరుపల్లి, బట్టేపాడు సర్పంచ్‌లు సతీష్, ఆదిలక్ష్మమ్మ, చెరుకూరు చిన్న చెంచమ్మ, పలువురు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బూదవాడ పంచాయతీకి జిల్లా అవార్డు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలంలోని బూదవాడ పంచాయతీకి మౌలిక సదుపాయాలు, స్వయం సమృద్ధి విభాగంలో జిల్లా స్థాయి అవార్డు దక్కింది. సోమవారం నెల్లూరు జెడ్పీ సమావేశ మందిరంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, సీఈఓ చిరంజీవి, జెడ్పీటీసీ సభ్యుడు మల్లు సుధాకర్‌రెడ్డి, తదితరుల చేతులు మీదుగా అవార్డు, ప్రశంసాపత్రంను సర్పంచ్ మంచాల హరిబాబు, పంచాయతీ కార్యదర్శి లెనిన్‌తో కలిసి అందుకున్నారు.

నాగసముద్రం పంచాయతీకి జిల్లా పురస్కారం

కలిగిరి: మండలంలోని నాగసముద్రం పంచాయతీ క్లీన్ అండ్ గ్రీన్ విభాగంలో జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ, సీఈఓ చిరంజీవి చేతుల మీదుగా జిల్లా స్థాయి ఉత్తమ పంచాయతీ పురస్కారాన్ని సర్పంచ్ డి. శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి వెలుగోటి మధుకు అందించి ఘనంగా సత్కరించారు.

వాశిలి సర్పంచ్‌కి సత్కారం

ఆత్మకూరురూరల్: జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని వాశిలి పంచాయతీ సమృద్ధిగా నీటి వనరులు కలిగిన విభాగంలో జిల్లా అవార్డు దక్కింది. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, సీఈఓ చిరంజీవి, ఆత్మకూరు జెడ్పీటీసీ పెమ్మసాని ప్రసన్నలక్ష్మీ, చేతుల మీదుగా వాశిలి సర్పంచ్ చెలిక రమా, పంచాయతీ కార్యదర్శి ఫర్వీన్ సత్కారం అందుకున్నారు.



ప్రశంసా పత్రాలు అందుకున్న సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో ఎంపీపీ, ఎంపీడీఓ

సర్పంచ్‌లకు ఘన సన్మానం

సంగం: జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా మండలంలో ఉత్తమ సేవలు అందించిన 14 పంచాయతీల సర్పంచ్‌లకు వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి సోమవారం ఎంపీడీఓ గోపి సర్పంచ్‌లను సన్మానించారు. మండలంలోని సర్పంచ్‌లు గంగపట్నం సునీల్, కరకంబాకం పద్మమ్మ, బండ్ల ప్రసన్న, పూనేటి అనూషను సత్కరించి, వారికి అవార్డులు ప్రదానం చేశారు. వైఎస్సార్‌సీపీ నేత కంటాబత్తిన రఘునాథ్‌రెడ్డి, కరిముల్లా, ఫణీంద్రరెడ్డి పాల్గొన్నారు.

8 పంచాయతీలకు అవార్డులు

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మర్రిపాడు మండలంలో వివిధ విభాగాలకు సంబంధించి 8 గ్రామ పంచాయతీలు అవార్డులు దక్కించుకున్నాయని ఇన్‌చార్జి ఎంపీడీఓ మస్తాన్‌ఖాన్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులను శాలువా, పూలమాలలతో సత్కరించి ప్రశంసా పత్రాలు అందజేశారు. మండలంలోని డీసీపల్లి, ఇర్లపాడు, నందవరం, బూదవాడ, చిలకపాడు, చిన్నమాచనూరు, అల్లంపాడు, పల్లవోలు పంచాయతీలు అవార్డులు దక్కించుకున్న వాటిలో ఉన్నాయి.

జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం

కలిగిరి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ మెట్టుకూరు శిరీష అధ్యక్షతన జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలో ఉత్తమ సేవలు అందించిన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ప్రసంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, ఎంపీడీఓ ఆర్‌వీ కళాధర్‌రావు, పంచాయతీరాజ్‌శాఖ ఏఈ రవీంద్రనాథ్, సర్పచులు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు పాల్గొనారు.



కలిగిరి: నాగసముద్రం సర్పంచ్ శ్రీనివాసులును సత్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ, సీఈఓ

సర్పంచ్‌లకు ఘనంగా సన్మానం

సోమశిల(చేజర్ల): అనంతసాగరం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా సర్పంచ్‌లను ఘనంగా సన్మానించారు. మొత్తం 15 పంచాయతీలకు అవార్డులు అందజేయగా, 5 అవార్డులను ముస్తాపురం పంచాయతీ, మూడు అవార్డులను పడమటి కంభంపాడు, కొత్తపల్లి సొంతం చేసుకొన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎండీపీఓ మధుసూదన్‌రావు, విస్తరణాధికారి ప్రసాద్, పీకే పంచాయతీ కార్యదర్శి రమేష్ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పంచాయతీ సర్పంచ్‌లకు సన్మానం

చేజర్ల: జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ఎంపికైన సర్పంచ్‌లకు సర్టిఫికెట్లు ఇచ్చి ఘనంగా సన్మానించారు. సోమవారం చేజర్ల మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి మండల ఎంపీపీ బాలిరెడ్డి రమాదేవి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలిరెడ్డి సుధాకర్‌రెడ్డి ఎంపీడీఓ విజయలలిత, పంచాయతీ సెక్రటరీ రామయ్య హాజరయ్యారు. మొత్తం 26 పంచాయతీలకు 9 పంచాయతీలకు 9 విభాగాల్లో 23 అవార్డులు లభించాయి.

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం



వాశిలి సర్పంచ్ చెలిక రమాను సత్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ

అల్లూరు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఘనంగా వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులను సన్మానించి అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారిణి మృదుల, ఎంపీడీఓ శ్రీదేవి, ఈఓపీఆర్డీ వీరేంద్ర, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ వ్యవస్థ ఎంతో పటిష్టం

జలదంకి: పంచాయతీరాజ్ వ్యవస్థ ఎంతో పటిష్టమైందని ఎంపీడీఓ ఎం.శ్రీధర్‌బాబు అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని నిర్వహించారు. జమ్మలపాళెం పంచాయతీకి జిల్లా స్థాయిలో, బ్రాహ్మణక్రాక, కేశవరం, సోమవరప్పాడు, గోపన్నపాళెం, చోడవరం పంచాయతీలకు మండల స్థాయిలో అవార్డులు వచ్చినట్లు తెలిపారు. అవార్డులు పొందిన పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు అవార్డులు అందించారు.

ఘనంగా పంచాయతీరాజ్ దివస్

వింజమూరు(ఉదయగిరి): ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీరాజ్ దివస్‌ను సోమవారం ఘనంగా నిర్వహించారు. మహాత్మాగాంధీ, బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలో ఉత్తమ పంచాయతీలుగా ఎంపికైన సర్పంచ్‌లు, కార్యదర్శులను సన్మానించి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. జెడ్పీటీసీ గణపం బాలకృష్ణారెడ్డి, ఎంపీడీఓ ప్రసన్న పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీలకు స్వయంప్రతిపత్తి

ఉదయగిరి: గ్రామ పంచాయతీలకు స్వయం ప్రతిపత్తి కల్పిస్తూ పార్లమెంట్ ఆమోదం చేసిన 73వ రాజ్యాంగ సవరణ అమల్లోకి వచ్చిన రోజు జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ అధ్యక్షతన జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ఆరు పంచాయతీలను ఉత్తమ పంచాయతీలుగా ఎంపిక చేసి అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఓ రేణుక, ఈఓపీఆర్డీ మల్లికార్జున, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలు

కొండాపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత ఎంపీపీ బొడ్డు అనూరాధ మహాత్మాగాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఓ శేషసాయి, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న బూదవాడ సర్పంచ్ మంచాల హరిబాబు, కార్యదర్శి లెనిన్



సర్పంచ్‌లను సన్మానిస్తున్న ఎంపీడీఓ



వెలగపాడు సర్పంచ్ వెంకటసుబ్బయ్యను సత్కరిస్తున్న ఎంపీపీ శిరీషా



పంచాయతీ కార్యదర్శికి ఉత్తమ అవార్డు ఇస్తున్న ఎంపీడీఓ, తాజుద్దీన్



జిల్లాస్థాయి అవార్డు అందుకుంటున్న జమ్మలపాళెం సర్పంచ్ బుర్రి శ్రీవేణి



చేజర్ల గ్రామ సర్పంచ్ ఆవుల వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న దృశ్యం



సర్పంచ్‌కు అవార్డు ఇస్తున్న దృశ్యం



సర్పంచ్‌లను సత్కరించి అవార్డులు అందజేసిన ఇన్‌చార్జి ఎంపీడీఓ మస్తాన్‌ఖాన్

వారంలో రెండో పంటకు నీరు విడుదల

- సోమశిల ప్రాజెక్ట్–4 ఈఈ

ఆత్మకూరు: జిల్లా ఐఏబీ నిర్ణయం మేరకు ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలో రెండో పంటకు వచ్చే వారం నుంచి నీరు విడుదల చేయనున్నట్లు సోమశిల ప్రాజెక్ట్ డివిజన్–4 ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఎం.వెంకటరమణారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ వాస్తవానికి ఐఏబీ నిర్ణయం మేరకు 25 వేల ఎకరాలకు నీరు విడుదల చేయాల్సి ఉందన్నారు. అనంతసాగరం, ఆత్మకూరు తదితర మండలాల్లో రెండో పంటగా సుమారు 30 వేల ఎకరాలు సాగవుతుందని తెలిపారు. ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సూచనల మేరకు ఏఎస్‌పేట మండలంలోని పత్తిసాగు చేస్తున్న రైతులకు కొంత మేర నీరు విడుదల అవుతున్నట్లు తెలిపారు. అయితే రెండో పంట నీటి విడుదల క్రమంలో రైతులు అధికారులకు సహకరించాలని, సోమశిల జలాశయంలో డెడ్‌స్టోరేజ్, తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఆత్మకూరుకు 25 వేల ఎకరాలకు మాత్రమే నీరు విడుదలకు అనుమతులు ఉన్నాయన్నారు. సాగునీటిని వృథా చేయరాదని అవసరాల మేరకే నీరు పొలాలకు పారించుకోవాలని తెలిపారు.

నిన్న వరి.. నేడు మామిడి

- రైతులపై ప్రకృతి ప్రకోపం
- 200 హెక్టార్లలో నేలరాలిన మామిడి



దెబ్బతిన్న మామిడి తోటలను పరిశీలిస్తున్న ఉద్యానశాఖాధికారిణి సుధామయి

కావలి/బిట్రగుంట: కావలి డివిజన్‌లో అకాల వర్షాలు రైతులను నట్టేటా ముంచుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు నియోజకవర్గంలోని పలు మండలాల్లో కోతకు వచ్చిన వరి పంట తీవ్రంగా దెబ్బతిన్న విషయం తెలిసిందే. ధాన్యం కంకులతో కళకళలాడుతున్న వరి కయ్యలు రైతుల కళ్ల ముందే నేలవాలిపోవడంతో రైతులు అల్లాడిపోయారు. తాజాగా ఆదివారం సాయంత్రం కురిసిన వర్షం, భారీ ఈదురుగాలులు మామిడి రైతుల ఆశలను ఆవిరి చేశాయి. అసలే ఈ దఫా మామిడిలో తేనె మంచు, తామర పురుగుల ఉధృతితో పెట్టుబడులు గణనీయంగా పెరగ్గా, దిగుబడులు అంతంత మాత్రంగా ఉన్నాయి. ఈ క్రమంలో వర్షం, ఈదురుగాలుల కారణంగా పలుచోట్ల పక్వానికి వచ్చిన కాయలు రాలిపోవడం, దెబ్బతినడంతో రైతులకు నష్టం వాటిల్లింది. నియోజకవర్గం పరిధిలోని కావలి, అల్లూరు, బోగోలు, దగదర్తి మండలాల పరిధిలో సుమారు నాలుగు వేల ఎకరాల్లో మామిడి సాగవుతుంది. ఆదివారం సాయంత్రం వీచిన ఈదురుగాలులకు సుమారు 100 హెక్టార్లలో మామిడి తోటలకు నష్టం వాటిల్లింది. ఎకరాకు అర టన్ను నుంచి టన్ను వరకు కాయలు రాలిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కావలి మండలం సర్వాయపాళెం, బోగోలు మండలం జువ్వలదిన్నె, ఎస్వీపాళెం తదితర గ్రామాల్లో దెబ్బతిన్న మామిడి తోటలను ఉద్యానశాఖాధికారిణి సుధామయి సోమవారం పరిశీలించి పంట నష్టంపై అంచనాలు తయారు చేశారు.

క్షయను మందులతో నయం చేసుకోవచ్చు

ఉదయగిరి: క్షయ వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా ఆరు నెలలు మందులు వాడితే వ్యాధిని దూరం చేసుకోవచ్చని మండల వైద్యాధికారిణి శివకల్పన సూచించారు. సోమవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్ర పాత భవనంలో క్షయ వ్యాధిగ్రస్తులకు జిల్లా క్షయవ్యాధి నియంత్రణాధికారి వెంకటప్రసాద్ అందజేసిన అదనపు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వ్యాధి గురించి భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఎక్కువగా పప్పు దినుసుల ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల శరీరంలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ శివకుమారి, సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ మురళీ, క్షయవ్యాధి పర్యవేక్షకుడు బి.వెంకటేశ్వర్లు మలేరియా సబ్‌యూనిట్ అధికారి నౌషాద్‌బాబు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిగ్రస్తులకు నిత్యావసర సరుకులు

వరికుంటపాడు: స్థానిక సాయిబాబా మందిరంలో నిర్వాహకులు క్షయ వ్యాధిగ్రస్తులకు సోమవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. విజయవాడకు చెందిన అల్లు దినేష్ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు, స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యసిబ్బంది సంయుక్త దాతృత్వంతో అందించిన సరుకులను వ్యాధిగ్రస్తులకు అందజేశారు. మందిరం నిర్వాహకులు శ్రీనివాసులు, రమణయ్య, మాలకొండయ్య, కాంతారావు, ఆరోగ్య సిబ్బంది రాజశేఖర్‌రాజు, సుశీలమ్మ, వెంకటేశ్వర్లు, మురళి, జానకి పాల్గొన్నారు.



పౌష్టికాహార కిట్లు అందిస్తున్న శివకల్పన

టీబీ రోగులకు పౌష్టికాహారం పంపిణీ

ఆత్మకూరు: ప్రధాన్‌మంత్రి టీబీ ముక్తా భారత్ అభియాన్‌లో భాగంగా పలువురు టీబీ పేషెంట్లకు ఆత్మకూరు అర్బన్ వైద్యశాలలో సోమవారం న్యూ ట్రీషన్ (పౌష్టికాహారం) అందజేశారు. సీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఆర్ రాకేష్, డాక్టర్ అస్మా టీబీ రోగులకు ఆస్పత్రిలో న్యూట్రీషన్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కె వెంకటేశ్వరరావు, చల్లా సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

నేటి నుంచి గడప గడపకు మన ప్రభుత్వం

చేజర్ల: మండలంలో మంగళవారం నుంచి ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారని ఎమ్మెల్యే కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. మండలంలోని పాడేరు, నాగులవెలటూరు సచివాలయాల పరిధిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని తెలిపారు. మధ్యాహ్నం 3.30 గంటలకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

హెచ్ఎంలకు శిక్షణ

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): పాఠశాలల్లో సామాజిక తనిఖీకి సంబంధించి మండలంలోని అన్ని పాఠశాలల హెచ్ఎంలకు మర్రిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. మర్రిపాడు ఎంఈఓ మాలకొండరావు పర్యవేక్షణలో డివిజనల్ రీసోర్స్ పర్సన్ షేక్ ఇస్మాయిల్ సామాజిక తనిఖీ ఉద్దేశం, ఆవశ్యకత, విధివిధానాలను క్షుణ్ణంగా తెలియజేశారు. పాఠశాలల పనితీరు, మూల్యాంకాన్ని తల్లిదండ్రుల కమిటీ సమక్షంలో 'స్కూల్ ఫర్మామెన్స్ ఎవాల్యూషన్ టూల్' అనే యాప్‌లో పొందుపరచాల్సి ఉంటుందన్నారు. ఎంఆర్‌పీ రాజేంద్రకుమార్, మర్రిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం వెంకటయ్య పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్‌పై అవగాహన ఉండాలి

జలదంకి: సోషల్ ఆడిట్‌పై అన్ని పాఠశాలల హెచ్ఎం అవగాహన కలిగి ఉండాలని ఎంఈఓ శ్రీధర్, మాస్టర్ ట్రైనర్ కిషోర్ అన్నారు. సోమవారం మండల విద్యా వనరుల కేంద్రంలో ప్రధానోపాధ్యాయులకు సోషల్ ఆడిట్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ సోషల్ ఆడిట్ వల్ల పాఠశాలల్లో మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. ట్రైనర్ మాట్లాడు తూ పాఠశాలల్లో మౌలిక వసతులు, విద్యార్థుల అకడమిక్ విషయాలు, ఉపాధ్యాయులు పని తీరు, విద్యార్థుల హక్కులు, భద్రత తదితర విషయాలపై హెచ్ఎంలకు శిక్షణ కల్పించారు.

బ్యాంక్ నిర్మాణ పనులను పరిశీలించిన సీఈఓ

అల్లూరు: స్థానిక ఇరిగేషన్ బంగ్లా ఎదురుగా నూతనంగా నిర్మిస్తున్న ఎన్‌డీసీసీ అల్లూరు బ్రాంచ్ నిర్మాణ పనులను సీఈఓ చల్లా శంకర్‌బాబు సోమవారం పరిశీలించారు. బ్యాంక్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీఎం సరిత, అల్లూరు వెస్ట్ సొసైటీ సీఈఓ రాధయ్య, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

ఉదయగిరి: మండలంలోని పాఠశాలల్లో రెండో విడత జరుగుతున్న నాడు–నేడు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంఈఓ మస్తాన్‌వలి, ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఉన్నత, మెయిన్, నార్తు పాఠశాలల్లో జరుగుతున్న పనులు పరిశీలించి తగు సూచనలు, సలహాలు అందజేశారు. బిల్లులు ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలన్నారు.

నాడు- నేడు పనుల పరిశీలన

జలదంకి: జలదంకి ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు- నేడు పనులను సోమవారం ఎంపీపీ గోచిపాతల వెంకటరమణయ్య పరిశీలించారు. పనుల వివరాల రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జలదంకి ఉప సర్పంచ్ కూరపాటి మాలకొండారెడ్డి ఉన్నారు.

'మెగా పీపుల్ సర్వే' ఒక చరిత్ర

కావలి: ఒక రాజకీయ పార్టీ రాష్ట్రంలోని ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పలకరించి ప్రభుత్వ పాలనపై వారి అభిప్రాయాలు సేకరించడం ఒక చరిత్ర అని కావలి పట్టణ వైఎస్సార్‌సీపీ మాజీ అధ్యక్షుడు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులు కనమర్లపూడి వెంకటనారాయణ, కుందుర్తి శ్రీనివాసులు, నెల్లూరు వెంకటేశ్వరరెడ్డి, గంధం ప్రసన్నాంజనేయులు, షేక్ షాహుల్ హమీద్, కనపర్తి రాజశేఖర్, అమరా వేదగిరి తదితరులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు జగనన్నే మా భవిష్యత్ మెగా సర్వేలో ఇప్పటికి కోటి కుటుంబాలు పాల్గొన్నాయని వెల్లడించారు. ఈ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దక్షతకు నిదర్శనమన్నారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో కావలి నియోజకవర్గంలో కూడా విస్తృతంగా సర్వే చేస్తున్నట్లు చెప్పారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి భావితరాలకు బంగారు బాటలు వేసేలా చరిత్రాత్మకమైన పనులు చేస్తున్న సీఎం వైఎస్ జగన్ పాలనపై టీడీపీ నాయకులు కడుపు మంట పుడుతుందని ఎద్దేవా చేశారు. కావలి నియోజకవర్గం అభివృద్ధి కోసం ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ప్రజలను కలుసుకుంటూ వారి సమస్యలు పరిష్కరిస్తున్నారన్నారు. గ్రావెల్ వ్యాపారం చేసి సంపాదించిన డబ్బుతో టీడీపీ నాయకుడిగా కావలికి దిగుమతి అయిన మాలేపాటి సుబ్బానాయుడు నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో పట్టణ వైఎస్సార్‌సీపీ నాయకులు కుందుర్తి కామయ్య, ఏగూరి చిన్న పుల్లయ్య, మండలి కృష్ణారావు, వడ్డమూడి వెంకటేశ్వర్లు, షేక్ ఖమర్ బాబు, పుత్తూరు నాగాచారి తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మొక్కజొన్న పంట పరిశీలన

సీతారామపురం: మండలంలోని బసినేనిపల్లి పంచాయతీలోని సుమారు వందెకరాలకు పైగా రైతులు మొక్కజొన్న పంట సాగు చేశారు. ఇటీవల కురిసిన వర్షానికి పంట నేలకొరిగింది. రైతులు వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో సోమవారం ఉదయగిరి ఏడీఏ బాలాజీనాయక్, సీతారామపురం, దుత్తలూరు ఏఓలు చెన్నారెడ్డి, వెంకటసుబ్బయ్య మొక్కజొన్న పంటను పరిశీలించారు. నేలమట్టమైన మొక్కజొన్న పంట వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. వీరి వెంట ఏఈఓ నారాయణ ఉన్నారు.

తడిచిన పచ్చిశనగలు కొనుగోలు చేయాలి

కలిగిరి: ఇటీవల కురిసిన అకాల వర్షాలకు తడిచి రంగు మారిన పచ్చిశనగలను ప్రభుత్వం కొనుగోలు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు కల్లూరి చంద్రమోళి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాకు చెందిన వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి స్పందించి ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తడిచిన శనగలను ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు నష్టపోకుండా ఆదుకోవాలని కోరారు.



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

